

మల్లన్న సేవలో హైకోర్టు జడ్జి

శ్రీశైలం: శ్రీశైల మల్లికార్జున స్వామిని శుక్రవారం రాష్ట్ర హైకోర్టు జడ్జి తర్లాద రాజశేఖర్‌రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి పురోహితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం: నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సూర్యప్రసాద్, అరవింద ఆర్ట్ అకాడమీ (అనంతపురం) వారి సంప్రదాయ నృత్యం భక్తులను అలరించింది.



భ్రామరీకి ఊయల సేవ

శ్రీశైలం: భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు శుక్రవారం, పౌర్ణమి సందర్భంగా ఊయల సేవ చేపట్టారు. ముందుగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

చుక్కల భూముల నివేదికలు ఇవ్వండి

నంద్యాల: చుక్కల భూములకు సంబంధించిన భూములను సబ్ డివిజన్ చేసి నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మండల తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన పలు రెవెన్యూ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చుక్కల భూములకు సంబంధించి 2017 యాక్ట్ ప్రకారం నివేదికలు తెప్పించుకొని సబ్ డివిజన్ చేసి నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రతిపాదనలు సంబంధిత ఆర్డీఓల ద్వారా సమర్పించాలన్నారు. నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి, బనగానపల్లి తదితర అన్ని మండలాల్లోని గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీల కోసం శ్మశాన వాటికలకు స్థలాలు గుర్తించి నివేదికలు ఇవ్వాలన్నారు. మండలాల్లో పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ పుల్లయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కామేశ్వరరావు, వెంకటశివ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పంపిణీకి ఏర్పాట్లు



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

ఆళ్లగడ్డ: పట్టణ పేదల కోసం ప్రభుత్వం నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. పట్టణ శివారులోని టిడ్కో గృహ సముదాయాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలో 1,392, డోన్‌లో 296 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు జూన్ చివరి వారంలో పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఒక్కో లబ్ధిదారుడికి అన్ని మౌలిక సదుపాయాలతో రూ. 10 లక్షల విలువైన ఇంటిని అందజేయనున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒక్కో లబ్ధిదారుడు రూ. 2.65 లక్షలు కట్టాలని ఆదేశాలు ఇవ్వగా ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఒక్క రూపాయికే ఇల్లు అందజేస్తున్నారన్నారు. ఈయన వెంట ఎస్ఈ రాజశేఖర్, డీఈఈ గుప్త, ఏఈ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు ఉన్నారు.

విదేశీ విద్యా దీవెన పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద ఆర్థిక సహాయం పొందేందుకు అర్హులైన జిల్లాలోని ఎస్సీ కులాలకు చెందిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారిణి చింతామణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ యూనివర్సిటీల్లో మొదటి 50 స్థానాల్లో ఉన్న విద్యాసంస్థల్లో పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ చదువుకునేందుకు అర్హత పొందిన విద్యార్థులు ఈ పథకానికి అర్హులన్నారు. టోఫెల్/ఐఈఎల్‌టీఎస్/జీఆర్ఈ/జీ మ్యాట్‌లో మంచి స్కోరు కలిగి ఉండాలన్నారు. క్వాలిఫయింగ్ కోర్సుల్లో 60 శాతం మార్కులు, సమాన గ్రేడ్ ఉన్న విద్యార్థులు ఈ పథకానికి అర్హులని, ఎంబీబీఎస్‌లో చేరాలనుకొనే వారు నీట్ పరీక్షల్లో అర్హత పొంది ఉండాలన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలకు మించరాదని, వయస్సు 35 ఏళ్లు నిండి ఉండరాదన్నారు. https://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా వచ్చేనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు స్థానిక జిల్లా సంక్షేమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ

- జూలై 1 నుంచి కంప్యూటరీకరణ కార్యక్రమం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్) కంప్యూటరీకరణకు రంగం సిద్ధమైంది. కర్నూలు జిల్లాలో 43, నంద్యాల జిల్లాలో 56 పీఏసీఎస్‌లు ఉన్నాయి. ప్రస్తుతం 2022-23 సంవత్సరంలో నిర్వహించిన లావాదేవీలకు సంబంధించి ఆడిట్ జరుగుతోంది. ఈ కార్యక్రమం జూన్ చివరికి పూర్తవుతుంది. జూలై 1 నుంచి పీఏసీఎస్‌ల కంప్యూటరణ కార్యక్రమాన్ని చేపడుతారు. ఇప్పటికే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 99 పీఏసీఎస్‌ల సీఈఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో బేసిక్ ఓరియంటేషన్ ట్రెనింగ్ పూర్తయింది. జూన్ చివరి నాటికి కంప్యూటరీకరణ పూర్తి కాగానే పీఏసీఎస్‌ల్లో లావాదేవీలన్నీ ఆన్‌లైన్ కానున్నాయి. ఫలితంగా లావాదేవీలలో పారదర్శకత పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నందికొట్కూరు మండలం కొనేటమ్మపల్లి సమీపంలో చీనీ తోట



ఉద్యాన పంటలకు ఉపాధి ఊతం

ఉద్యాన పంటల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం రైతులకు తోడ్పాటునందిస్తోంది. పండ్లు, పూలు, కూరగాయలు సాగు చేసే రైతులను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టింది. డ్రైల్యాండ్ హార్టికల్చర్‌లో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో అండగా నిలుస్తోంది. గతంలో ఉన్న నిబంధనలు సడలించి అధిక మంది రైతులకు ఉపయోగపడేలా మార్గదర్శకాలను రూపొందించింది. నిధుల కేటాయింపులో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ నేరుగా రైతు ఖాతాలో సబ్సిడీ జమ అయ్యేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

- పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం
- మొక్కల సంరక్షణకు మూడేళ్ల పాటు ఉపాధి హామీ నిధులు
- ఒక్కో రైతుకు ఐదు ఎకరాల్లో సాగుకు అవకాశం
- రైతు ఖాతాకే నేరుగా నిధులు జమ
- ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు సువర్ణ అవకాశం

ఉయ్యాలవాడ మండలం పెద్దయమ్మనూరులో డ్రాగన్ ఫ్రూట్స్ తోటను పరిశీలిస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు (ఫైల్)

నంద్యాల(రూరల్): జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మరో 5 వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకమే లక్ష్యంగా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం జిల్లాలో 1,280 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేశారు. వర్షా కాలంలో పండ్ల తోటల సాగుకు ఆసక్తి చూపే ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులను ప్రోత్సాహించేలా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను సబ్సిడీ రూపంలో కేటాయిస్తోంది. అధిక మంది రైతులు సద్వినియోగం చేసుకునేలా మార్గదర్శకాలను కూడా సవరించింది. గతంలో రెండున్నర ఎకరాల భూమి కలిగిన రైతులకు మాత్రమే తోటల పెంపకానికి సబ్సిడీ రూపంలో ఉపాధి హామీ నిధులు కేటాయించేది. అయితే గత ఏడాది నుంచి ఐదు ఎకరాల సొంత భూమి కలిగి ఉన్న రైతులకు కూడా ఈ అవకాశం కల్పించింది. మొక్కలు నాటిన రోజు నుంచి మూడేళ్ల వరకు వాటి సంరక్షణకు అవసరమైన నిధులను రైతుల ఖాతాలో జమ చేస్తోంది. తొలి ఏడాది మొక్కలు నర్సరీల నుంచి రైతులు తెచ్చుకునేందుకు అయ్యే రవాణా చార్జీలు కూడా అందజేస్తోంది. వాటిని నాటేందుకు గుంతలు తవ్వేందుకు అయ్యే కూలీల ఖర్చు చెల్లిస్తోంది. మెటీరియల్ రూపంలో సగం నిధులు, మొక్కల సంరక్షణకు కూలీల ఖర్చుగా రైతులకు నిధులు ఇస్తోంది. మొక్కల సంరక్షణకు ఎరువులతో పాటు నీటిని పోసేందుకు అయ్యే ఖర్చును గత ఏడాది నుంచి అందజేస్తోంది. రెండో ఏడాదిలో ఎరువులకు, మొక్కలకు నీరు పోసేందుకు, మూడో ఏడాది కూడా ఎరువులు, నీరు పోసేందుకు ఉపాధి హామీ నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది.

ఏఏ పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చంటే...

ఉపాధి హామీ పథకం కింద అన్ని రకాల పండ్లతోటలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంది. మామిడి, బత్తాయి, నిమ్మ, జామ, థైవాన్ జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, ఆపిల్‌బేర్, డ్రాగన్‌ఫ్రూట్స్, గులాబీ, మల్లె తోటలు అభివృద్ధి చేసుకోవచ్చు. మునగ, మల్లె, గులాబీ, ఆపిల్‌బేర్ తోటల నిర్వహణ బిల్లులు రెండేళ్లు మాత్రమే చెల్లిస్తారు. మునగ, మల్లె, గులాబీ తోట రైతుకు ఒక ఎకరా వరకు, డ్రాగన్‌ఫ్రూట్ అర ఎకరా వరకు అవకాశం ఉంది. మిగిలిన పండ్లతోటలు గరిష్టంగా 5 ఎకరాల వరకు సాగు చేసుకోవచ్చు. ఈ ఏడాది మునగసాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నారు. పంట కాలం తక్కువగా ఉండటం, పోషకాలు అధికంగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కరువును తరిమేలా..

సాధారణంగా పండ్ల తోటల పెంపకం నీటి వసతి ఉన్న భూముల్లోనే చేపడుతారు. రాయలసీమ జిల్లాలు ఏటా కరువు బారిన పడుతుండటంతో వైఎస్సార్ హయాంలో డ్రై ల్యాండ్ హార్టికల్చర్‌కు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు నీటి వసతి లేకపోయినా సమీపంలోని వంకలు, వాగులు, కుంటలు ఉంటే చాలు ఉపాధి నిధులతో పండ్లతోటల సాగుకు అవకాశం కల్పించారు. పండ్ల మొక్కలు నాటుకొని వాగులు, వంకలు, కుంటలు నుంచి మూడేళ్ల పాటు బిందెలతో నీళ్లు మోసుకొని తడులు ఇస్తే నీళ్లు మోసుకున్నందుకు ఉపాధి హామీ పథకం కింద డబ్బులు చెల్లిస్తారు. పండ్ల మొక్కలు చెట్టుగా అభివృద్ధి చెంది రైతులను కరువుకు దూరం చేయనున్నాయి.

దరఖాస్తు ఇలా..

అర్హులైన రైతులు గ్రామాల్లోని ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు దరఖాస్తులు అందజేయాలి. ఐదు ఎకరాల్లోపు భూములు కలిగి ఉండాలి. దరఖాస్తు చేసుకోవాలనుకునే రైతుల భూములకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకంతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, ఉపాధి హామీ జాబ్‌కార్డును దరఖాస్తుకు జత చేయాలి. చిన్న, సన్నకారు రైతులకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యాన తోటలు సాగు చేసే ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్న కారు రైతులకు ఇది మంచి అవకాశం. పైసా ఖర్చు లేకుండా తోటలు సాగు చేయవచ్చు. మూడేళ్ల పాటు ప్రభుత్వమే ఉపాధి హామీ నిధులను కేటాయిస్తుంది. పరోక్షంగా సంబంధిత రైతుకు కూడా ఉపాధి కలుగుతుంది. అర్హులైన రైతులు నేరుగా ఉపాధి హామీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. అర్హులైన రైతులకు మూడేళ్ల పాటు మెటీరియల్ కూలీల ఖర్చు కింద నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తాం. వివరాలకు 9121103297ను సంప్రదించండి.

– రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ, నంద్యాల

పండ్లతోటల సాగులో ఎకరాకు మూడేళ్లలో చెల్లించే సబ్సిడీ వివరాలు

పండ్లతోటలు	ఎకరాకు నాటే మొక్కలు	మూడేళ్లలో చెల్లించే మొత్తం (రూ..)
మామిడి	70	99,840
చీనీ	100	1,07,459
నిమ్మ	110	1,36,162
జామ	110	1,27,451
థైవాన్ జామ	444	2,26,783
సపోటా	60	88,655
కొబ్బరి	60	90,476
సీతాఫలం	240	1,82,840
దానిమ్మ	267	2,44,819
నేరేడు	20	41,292
ఆపిల్‌రేగు	320	1,08,338
డ్రాగన్‌ఫ్రూట్	225	1,84,533
గులాబీ	2000	50,720
మల్లె	1600	44,568
మునగ	448	1,02,426

డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేశా



ఉపాధి హామీ పథక అధికారుల సమన్వయంతో 50 సెంట్లలో 800 డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు నాటాను. మొక్కల పెట్టుబడికి ప్రభుత్వ ప్రతిపాదన ప్రకారం రూ.1.80 లక్షలకు గాను రూ.1.20 లక్షలు నా బ్యాంకు ఖాతాలో జమ అయ్యింది. ఈ మొక్కలతో పాటు అంతర్గత పంటలు కూడా వేశాను. ప్రభుత్వం పండ్ల తోటల సాగును ప్రోత్సహించడం చాలా సంతోషం.

– గాండ్ల సుధాకర్, పెద్దయమ్మనూరు, ఉయ్యాలవాడ మండలం

ప్రోత్సాహం బాగుంది



అధికారుల అవగాహన కల్పించడంతో గతేడాది 1.50 ఎకరాల్లో చీనీతోట వేశాను. ఖర్చులను ప్రభుత్వం సబ్సిడీ ద్వారా నా ఖాతాలో జమ చేసింది. వచ్చే ఏడాది మార్చికి మూడేళ్లు పూర్తవుతుంది. మూడేళ్ల వరకు చీనీ పంట ఖర్చులను ఉపాధి హామీ ద్వారా ప్రభుత్వం ఇస్తోంది.

– యుగంధర్‌రెడ్డి, బలపనూరు, పాణ్యం మండలం

పేదల ద్రోహి చంద్రబాబు

- పేదలకిచ్చే స్థలాలను సమాధులతో పోల్చడంపై వైఎస్సార్‌సీపీ నాయకుల నిరసన



శిరివెళ్లలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, పార్టీ నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్): అమరావతిలో పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే స్థలాలను మాజీ సీఎం చంద్రబాబు సమాధులతో పోల్చడంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పేదల ద్రోహి చంద్రబాబు అంటూ నినదించారు. టీడీపీ అధినేత దిష్టిబొమ్మలను దహనం చేశారు.

☛ మద్దికెరలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వమించారు. చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు.

☛ కోడుమూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు ప్రభాకర్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

☛ డోన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పాల్గొన్నారు.

☛ శిరివెళ్లలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు చంద్రబాబు దిష్టి బొమ్మను దహనం చేశారు. వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దులసలాం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- జిల్లా కలెక్టర్ మనజీర్‌జిలానీ శామూన్
- ఉత్తమ వలంటీర్లకు పతకాలతో సత్కారం



వలంటీర్‌ను పతకం, సర్టిఫికెట్‌తో సత్కరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

నంద్యాల: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఎల్‌డీఓ జనార్దన్, సంబంధిత అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి అందజేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించారన్నారు. వారు చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది వలంటీర్లకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ పరిణామన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామంలోనే ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను చేరవేస్తున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివన్నారు. జిల్లాలో సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు పొందిన గ్రామ వార్డు వలంటీర్లు 8,082 మంది ఉన్నారన్నారు. సేవా వజ్ర నగదు పురస్కారం పొందిన 32 మందికి సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ.30వేల బహుమతి, సేవా రత్న నగదు పురస్కారం పొందిన 179 మందికి సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ.20వేల బహుమతి, సేవా మిత్ర పురస్కారం పొందిన వారు 7,871 మందికి సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్, మెడల్‌తో పాటు రూ.10 వేల బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించి సేవా మిత్రా, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలకు ఎంపికైన కే.ప్రదీప్, పి.వసుంధర, పి.శివ కుమార్, ఎస్.రబియ, రియాజ్ ఖాన్, ఎం.శ్వేత, ఎస్.మహబూబ్, ఎస్.ఖరీముల్లా, నరసింహ రెడ్డి, ఎం.అనిత, జే.భాస్కర్ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లకు పతకాలు అందించి శాలువాలతో కలెక్టర్, ఎమ్మెల్యే సత్కరించారు. పురస్కారం పొందడంతో మరింత బాధ్యత పెంచుతుందని కలెక్టర్ గుర్తు చేశారు.

ప్రభుత్వ మేలును ప్రజలకు వివరించండి..

సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం మేలును ప్రజలకు వివరించాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సూచించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా వున్న వలంటీర్లు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మరింత పేరు తీసుకురావాలన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా టీడీపీ నాయకులు చెప్పిన వారికే పథకాలు వచ్చేవన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలతో కుల, మత, రాజకీయాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పింఛన్ కోసం గత ప్రభుత్వంలో రోజుల తరబడి పంచాయతీ కార్యాలయాల వద్ద వృద్ధులు, వికలాంగులు ఎదురు చూసేవారని, కాని నేడు ఇంటి వద్దకే తెల్లవారుజామునే వలంటీర్లు వచ్చి పింఛన్ అందజేస్తున్నారన్నారు. పింఛన్ మొదలు రేషన్ కార్డు వరకు ఏదీ కావాలన్నా సచివాలయ వ్యవస్థ ద్వారానే పూర్తవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటరీ వ్యవస్థను తీసివేసి జన్మభూమి కమిటీలను వేస్తారని ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే సీఎం ధ్యేయం

- టీడీపీ నాయకుల అబద్ధాలను ప్రజలు నమ్మరు
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- డిప్ పద్ధతిన 3,006 మందికి పారదర్శకంగా స్థలాల ఎంపిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(సిటీ): పేదలందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కలను సాకారం చేయడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్ట్ పద్ధతిన మొదటి విడత 3,006 మంది పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. పారదర్శకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ పట్టణంలో ఇళ్ల పట్టాల పంపిణీలో జాప్యానికి టీడీపీ నాయకులు ఎన్జీటీలో వేసిన పిల్ కారణమన్నారు. పేదలకు అనుకూలంగా కేసు గెలవడంలో ముఖ్యమంత్రి చొరవతో పాటు అడిషనల్ అడ్వకేట్ జనరల్ సుధాకర్‌రెడ్డి సహకారం, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఆర్‌డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఇతర జిల్లా స్థాయి అధికారుల కృషి ఎంతో ఉందన్నారు. జిల్లా కేంద్రం నంద్యాలలో 150 ఎకరాలకు గాను కోర్టు ఉత్తర్వుల మేరకు కుందూ పరివాహక ప్రాంతం, వెడల్పు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని 108 ఎకరాల్లో ఇళ్ల స్థలాల పంపిణీకి రంగం సిద్ధమైందన్నారు. సుమారుగా 5 వేల మందికి పైగా పట్టాలు ఇచ్చేందుకు ప్రణాళికలు తయారు చేశామన్నారు. మొదటి విడతలో 3,006 మంది లబ్ధిదారులకు ఈ నెల 23వ తేదీ నుంచి పట్టాలు పంపిణీ చేయనున్నామన్నారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. అధికార పార్టీ నేతలే ఇళ్ల స్థలాలను అడ్డుకునేలా కోర్టు కెళ్లారని లోకేశ్ ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఇళ్ల స్థలాలు పంపిణీ అడ్డుకుంటే అధికార పార్టీకి లాభామా.. నష్టమా అనేది తెలియకుండా బుర్రలేని విమర్శలు చేయడం లోకేశ్‌కే చెల్లిందన్నారు. టీడీపీ నాయకుల అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గతంలో వైఎస్సార్ పాలనలో అప్పటి మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి హయాంలో పట్టణంలో వైఎస్సార్ నగర్, శిల్పానగర్ ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. మళ్లీ ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మరోమారు పేదలకు పట్టాలను పంపిణీ చేస్తుండటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ పేద ప్రజల ఏళ్ల కల నేడు సాకారం అయ్యిందన్నారు. టీడీపీ నీచ రాజకీయాలు మానుకుంటే మంచిదన్నారు. ప్రభుత్వం మంచి పని చేసినా అందులో తప్పును వెతుక్కోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, కో ఆప్షన్ సభ్యులు సలాముల్లా, రాష్ట్ర డైరెక్టర్లు సునీత అమృతరాజ్, చంద్రశేఖర్, శశికళారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

- ఎస్పీ రఘువీర్ రెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

కోవెలకుంట్ల: మట్కా, పేకాట, నాటుసారా, మద్యం అక్రమ రవాణా, తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం డీఎస్పీ వెంకట రామయ్యతో కలసి కోవెలకుంట్ల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రిమినల్ కేసులకు సంబంధించిన వివరాలను సీఐ నారాయణరెడ్డి, ఎస్ఐలు వెంకటరెడ్డి, మౌలానీని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ ఆవరణ, వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, లాకప్ గదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల మర్యాద పూర్వకంగా ప్రవర్తించి ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అవలంభించాలన్నారు. రాత్రి వేళల్లో బీట్స్‌ను పెంచి రెగ్యులర్‌గా జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయిలో నియంత్రించాలన్నారు. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడే వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించారు.

22లోగా ఇంజనీర్ల సర్వీసు వివరాలివ్వండి

కర్నూలు(అర్బన్): ఉద్యోగుల సాధారణ బదిలీల నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆయా డివిజన్లు, సబ్ డివిజన్ల ఇంజనీర్ల సర్వీసు వివరాలను ఈ నెల 22వ తేదిలోగా పంపించాలని పీఆర్ పర్యవేక్షక ఇంజనీరు కె.సుబ్రమణ్యం కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వివిధ కేడర్లలో దాదాపు 200 మంది ఇంజనీర్లు పని చేస్తున్నారన్నారు. వీరిలో రెండు నుంచి ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తయిన వారి వివరాలను పంపాలన్నారు. సంబంధిత ఈఈలు ఆయా సబ్ డివిజన్ల నుంచి సమాచారాన్ని తెప్పించుకొని పంపించాల్సి ఉందన్నారు. తమకు అందిన సమాచారాన్ని అదే రోజున అనంతపురం ఎస్ఈ కార్యాలయానికి పంపుతామన్నారు.

87 కేంద్రాల్లో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షకు 87 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆర్ఐఓ గురువయ్య శెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించే పరీక్షలకు డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్స్‌లను నియమించామన్నారు. పరీక్షల నిర్వహణపై కర్నూలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి పరీక్షల సిబ్బంది హాజరు కావాలన్నారు.

ముగిసిన ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు

కర్నూలు సిటీ: ఏపీఈఏపీ సెట్‌లో ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు ఈ నెల 15వ తేదీన మొదలై శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజున ఉదయం మాత్రమే పరీక్ష నిర్వహించారు. శుక్రవారం పరీక్షకు కర్నూలు జిల్లాలో 1,236 మందికిగాను 1188 మంది, నంద్యాల జిల్లాలో 525 మందికిగాను 498 మంది హాజరైయ్యారు. ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలకు మొత్తంగా కర్నూలు జిల్లాలో 9,203 మందిగాను 8723 మంది, నంద్యాల జిల్లాలో 4,395 మందికి గాను 4,154 మంది హాజరయ్యారు.

రేపటి నుంచి అగ్రికల్చర్–ఫార్మసీ పరీక్షలు

అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాలకు నిర్వహించనున్న ప్రవేశ పరీక్షలను రేపు(ఆదివారం), సోమవారం ఉమ్మడి జిల్లాలో 12 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. కర్నూలు జిల్లా నుంచి 7,462 మంది, నంద్యాల జిల్లా నుంచి 2,205 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

గూడూరు: పట్టణానికి చెందిన మాదప్ప గాల్ల రంగయ్య (43) అనే వ్యక్తి వడ దెబ్బతో మృతి చెందాడు. శుక్రవారం తన సొంత పొలంలో పనులు చేసుకుంటూ ఎండ తీవ్రతకు సొమ్మసిల్లి పడిపోయి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ప్రవేశాలు 'ఫుల్'

- నో అడ్మిషన్ బోర్డు పెట్టిన ఆదోని మున్సిపల్ ఉన్నత పాఠశాల
- ఇప్పటికే ఒక్కో తరగతికి 400 మంది విద్యార్థులు
- అయినా ప్రవేశాల కోసం క్యూ కడుతున్న తల్లిదండ్రులు


ఆదోని అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో సర్కార్ స్కూళ్లలో ప్రవేశాలు ఏడాదికేడాదికి పెరుగుతున్నాయి. విద్యార్థులు ఎక్కువ కావడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నో అడ్మిషన్ బోర్డులు పెడుతున్నారు. ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ పాఠశాలలో ప్రస్తుతం 6 నుంచి 10వ తరగతి వరకు 1,985 మంది విద్యార్థులు ఉన్నారు. 7వ తరగతిలో 375, 8వ తరగతిలో 410 మంది, 9వ తరగతిలో 495 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో ఒక్కొక్క తరగతికి నాలుగు గదులు కేటాయించారు. ఒక తరగతి గదిలో 95 మంది నుంచి వంద మంది వరకు కూర్చొంటున్నారు. తరగతి గదిలో కూర్చోడానికి స్థలం కూడా ఉండడం లేదు. ఈ నేపథ్యంలో నో అడ్మిషన్ బోర్డును ఏర్పాటు చేశారు.

అన్ని రకాల సౌకర్యాలు

విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారు. నాడు–నేడు కింద పాఠశాలల రూపురేఖలను మార్చారు. ప్రతి ఒక్క పేద విద్యార్థి చదవాలన్న ఉద్దేశంతో అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, దుస్తులు, షూష్, టై ఉచితంగా అందిస్తున్నారు. ఇంగ్లిష్ మీడియం అమలు, డిజిటల్ విద్యా బోధన సాగుతుండడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1,300 మంది విద్యార్థులు ఉండేవారు. ప్రతియేటా 600 నుంచి 700 మంది పెరుగుతూ ప్రస్తుతం 1,985 మంది కి చేరారు. జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయానికి మరో వెయ్యి మంది విద్యార్థులు చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ పాఠశాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో రూ.94 లక్షలు మంజూరు చేసింది. రెండో విడతలో మరో 14 గదుల కోసం ఒక్కొక్క గది ఏర్పాటుకు రూ.15 లక్షలు నిధులు మంజూరు చేసింది. త్వరలో ఈ పనులు పూర్తి కానున్నాయి.

ప్రవేశాల్లో 'ప్రభుత్వ' విద్యార్థులకు ప్రాధాన్యం

వందలాది మంది ప్రయివేట్ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు మున్సిపల్ హైస్కూల్‌కు క్యూ కడుతున్నారు. అడ్మిషన్లు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే నోటీసు బోర్డులో ।నో అడ్మిషన్। అని ఉంచామని ఉపాధ్యాయులు చెప్పారు. మొట్టమొదట ప్రభుత్వ పాఠశాల వారికే ప్రాధాన్యత ఇస్తామని, అనంతరం ప్రయివేట్ పాఠశాలల వారికి అవకాశం ఇస్తామని తెలిపారు.





నోటీసు బోర్డులో నో అడ్మిషన్స్ అని రాసిన దృశ్యం, ఆదోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాల

మిగిలితే ఇస్తాం



ప్రైవేట్ పాఠశాలల్లో చదివించలేకపోతున్నామని, ఇక్కడ సౌకర్యాలు బాగా ఉన్నాయని, ఎలాగైనా తమ విద్యార్థులను చేర్పించుకోవాలని తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో మేం నో అడ్మిషన్ బోర్డును అతికించాం. మొదటి ప్రాధాన్యత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇస్తాం. ఆ తర్వాత సీట్లు మిగిలితే ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– అలీంసిద్దిఖీ, పాఠశాల హెచ్‌ఎం

కురువ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

నంద్యాల(అర్బన్): జిల్లాలో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి పది, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన కురువ విద్యార్థిని, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా కురువ సంఘం ఉపాధ్యక్షుడు కత్తిశంకర్ తెలిపారు. స్థానిక సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మా ట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన అర్హులైన ప్రతిభావంతులు ఈనెల 21వ తేదీ లోగా మార్కుల జాబితా, కుల, సర్టిఫికెట్లను 9440756199, 9031241194 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగస్వామి, నాయకులు జగదీష్, అల్లబాబు, లింగమయ్య, కిశోర్, శ్రీనివాసులు, నాగరాజు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కడపరాజుపల్లె గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన పెరుమాళ్ల శాంతయ్య (26) గురువారం అర్ధరాత్రి ఇంటి వరండాలోని ఇనుపరాడ్డుకు ఉరేసుకుని మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. శాంతయ్యది నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం శివాపురం గ్రామం కాగా, కడపరాజుపల్లెకు చెందిన గోన రంగయ్య కుమార్తె శాంతకుమారిని వివాహం చేసుకుని ఇక్కడే నివసిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏ కారణం లేకుండా ఆత్మహత్య చేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు

పగిడ్యాల: ఎం. ఘణపురం గ్రామ పంచాయతీలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు చోటు చేసుకోవడంతో టెక్నికల్ అసిస్టెంట్ రంగారెడ్డి, ఫీల్డ్‌అసిస్టెంట్ నాగేంద్రకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. 'బోగస్ హాజరుతో బొక్కేశారు' అనే శీర్షికన గురువారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని టెక్నికల్, ఫీల్డ్‌అసిస్టెంట్లకు శుక్రవారం ఎంపీడీఓ వెంకటరమణ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఉపాధి కూలీలను వ్యక్తిగతంగా విచారించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని పేర్కొన్నారు. జిల్లా అధికారులు కూడా విచారణ నిమిత్తం వస్తారన్నారు. అక్రమాలు నిర్ధారణ అయితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

చీటింగ్ కేసులో ఇరువురికి జైలు శిక్ష

కోవెలకుంట్ల: నకిలీ పాసుపుస్తకాలు సృష్టించిన కేసులో ఇద్దరు వ్యక్తులకు శుక్రవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జైలు శిక్ష పడింది. ఎస్ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. మండలంలోని జోళదరాశి గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి, రఘునాథ్ పోర్జరీ సంతకాలతో నకిలీ పాసుపుస్తకాలు సిద్ధం చేసి పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సుబ్బారెడ్డికి 2017లో పొలం అమ్ముతామని రూ. 2.50 లక్షలు అడ్వాన్స్ తీసుకున్నారు. పొలం రిజిస్ట్రేషన్ సమయంలో విషయం బయట పడటంతో తీసుకున్న డబ్బులు వెనక్కు ఇవ్వాలని బాధితుడు అడిగినా ఇవ్వకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కేసు విచారణలో ఉండగా కోవెలకుంట్ల కోర్టులో కేసు నిర్ధారణ కావడంతో ఇద్దరికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం



రాష్ట్ర స్థాయి చెస్ పోటీల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తదితరులు

నంద్యాల(న్యూటౌన్): క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పేర్కొన్నారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో రామకృష్ణ పీజీ కళాశాల ఆవరణంలో జూన్ 8 నుంచి 11వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీల వాల్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శిల్పా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ నంద్యాల జిల్లా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నంద్యాల ప్రాంతంలో చెస్‌కు విశేష ఆదరణ రావడంలో అసోసియేషన్ కృషి ప్రశంసనీయమన్నారు. చెస్ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రవికృష్ణ, రామ సుబ్బారెడ్డి, టోర్నమెంట్ చైర్మన్ హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు రూ. 50వేల నగదు బహుమతులతో పాటు ట్రోఫీ, పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈనెల 31లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9010451585ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బెస్త సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యుటీషియన్ రంగంలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ మహిళలకు బ్యుటీషియన్ రంగంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. జూన్ నెల 10న మొదలై 30 రోజుల పాటు సాగుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు 90007 10508 ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సులో చోరీకి యత్నం

- డ్రైవర్ చాకచక్యంతో అడ్డంగా దొరికిన దొంగ

కొలిమిగుండ్ల: వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు టాప్‌పై ఉన్న లగేజీని అపహరించేందుకు యత్నించిన ఓ దొంగ.. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో అడ్డంగా దొరికిపోయాడు. గురువారం రాత్రి అనంతపురం జిల్లా గుంతకల్లు నుంచి నెల్లూరుకు బయలు దేరిన సూపర్ లగ్జరీ బస్సు టాప్‌పై జీన్స్‌ప్యాంట్లకు చెందిన బ్యాగులు వేశారు. మార్గమధ్యలో తాడిపత్రి నుంచి బయలు దేరిన తర్వాత టాప్‌పైకి ఎక్కిన నందలపాడుకు చెందిన ఏసుబు కొద్ది దూరంలో వెళ్లిన తర్వాత జీన్స్ ప్యాంట్ల బ్యాగులు కిందకు పడవేస్తువచ్చాడు. బస్సు వెనుక మరో వాహనంలో వస్తున్న కొంత మంది వ్యక్తులు వాటిని తీసుకుంటున్నారు. అదే సమయంలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు గమనించి బుగ్గ దాటిన తర్వాత బస్సు డ్రైవర్‌కు చోరీ విషయాన్ని చెప్పారు. ఆ సమయంలో బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించాడు. నిర్మానుష్య ప్రదేశం కావడంతో బస్సు అక్కడ నిలిపితే దొంగ తప్పించుకునే ప్రమాదముందని గమనించి బస్సును కొలిమిగుండ్ల మండలంలోని అంకిరెడ్డిపల్లెకు చేరుకున్నాడు. అప్పటికే బస్సులో ఉన్న ప్రయాణికులకు విషయం చెప్పి అప్రమత్తం చేశాడు. బస్సు నిలపగానే డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు క్షణాల్లో కిందకు దిగి దొంగ బస్సు దిగిక ముందే పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అంకిరెడ్డిపల్లెకు చేరుకుని వివరాలు సేకరించి దొంగను అదుపులోకి తీసుకున్నారు. ఏసుబుతో పాటు ఇంకా ఎవరెవరు ఉన్నారనే వాటిపై పోలీసులు విచారిస్తున్నారు.

జగనన్న ఆణిముత్యాలకు 49 మంది ఎంపిక

కర్నూలు(సిటీ): ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు (స్టేట్ బ్రిలియన్స్ అవార్డ్స్) పేరిట ప్రభుత్వం సత్కరించనుంది. అవార్డుల ప్రదానోత్సవాలను నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించేందుకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 49 మంది విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలకు ఎంపికయ్యారు. అలాగే జిల్లాస్థాయిలో టాప్–3 మార్కులు సాధించిన విద్యార్థులు ముగ్గురు ఉన్నారు. జిల్లాస్థాయిలో టాపర్‌గా నిలిచిన ముగ్గురు పదో తరగతి విద్యార్థులకు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.15 వేలు నగదు బహుమతి అందజేయనున్నారు. అలాగే పదో తరగతి నియోజకవర్గ టాపర్లకు మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేలు నగదు అందజేస్తారు. ఇంటర్మీడియట్‌లో టాపర్లకు రూ.15 వేలు చొప్పున నగదు అందజేస్తారు.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా పూజిత



బాధ్యతలు స్వీకరిస్తున్న నీలం పూజిత

కర్నూలు: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కర్నూలు ప్రాంతీయ అధికారి(ఆర్‌వీఈఓ)గా నీలం పూజిత నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా కడప జిల్లాలో సెబ్ అడిషనల్ ఎస్పీగా పని చేస్తున్న నీలం పూజితను కర్నూలుకు బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం పట్టణానికి చెందిన ఈమె 2012 గ్రూప్–1 బ్యాచ్ అధికారి. ప్రొద్దుటూరు, తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట, హైదరాబాద్ సిటీ సెంట్రల్ క్రైం స్టేషన్, ఏపీ సీఐడీ విభాగాల్లో డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. 2021లో అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది కడప సెబ్ విభాగంలో పనిచేస్తుండగా తాజా బదిలీల్లో ఆమెను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కర్నూలు ఆర్‌వీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల రోజుల క్రితం జరిగిన ఎస్పీల బదిలీల్లో కర్నూలు విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న తిరుమలేశ్వర్‌రెడ్డి నెల్లూరు జిల్లా ఎస్పీగా బదిలీపై వెళ్లడం తెలిసిందే.

ఉమ్మడి జిల్లాలో నూతన ఏఎస్పీల నియామకం

- కర్నూలుకు సర్కారు, నంద్యాలకు వెంకటరాముడు



జి.వెంకటరాముడు



టి.సర్కారు

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లా పోలీసు శాఖ లో ఇద్దరు నూతన అడిషనల్ ఎస్పీలు నియమితులయ్యారు. విజయవాడ సిటీ ట్రాఫిక్ డీసీపీగా పనిచేస్తున్న టి.సర్కారును కర్నూలుకు, కర్నూలు ఇంటెలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న గుండ్లమడుగు వెంకట్రాముడుకు పదోన్నతి కల్పించి నంద్యాల అడిషనల్ ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న డి.ప్రసాద్‌ను విజయవాడ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీగా, నంద్యాల జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న ఆర్.రమణ విజయవాడ అడిషనల్ డీసీపీ(అటాచ్డ్ డీజీ, కమాండ్ కంట్రోల్)గా బదిలీ అయ్యారు. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన వెంకట్రాముడుది వ్యవసాయ కుటుంబం. ఈయన 2012లో గ్రూప్–1 ద్వారా డీఎస్పీ హోదాలో పోలీసు శాఖలో చేరారు. మొదట గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా సేవలందించారు. నెల్లూరు టౌన్ డీఎస్పీగా, విజయవాడ సీఐడీ విభాగంలో ఏడాది, ఆదోని డీఎస్పీగా ఏడాది పాటు పనిచేశారు. 2019 జులై 26 నుంచి ఇప్పటివరకు కర్నూలు ఇంటెలిజెన్స్ విభాగం డీఎస్పీగా పనిచేశారు. తాజా బదిలీల్లో నంద్యాల అడ్మిన్ అడిషనల్ ఎస్పీగా నియమితులయ్యారు. అలాగే విజయవాడ సిటీ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీగా పనిచేస్తున్న టి.సర్కారు కర్నూలు అడ్మిన్ అడిషనల్ ఎస్పీగా ప్రభుత్వం నియమించింది. సర్వీసు 11 నెలలు మాత్రమే ఉండటంతో విధుల్లో చేరడానికి ఈయన విముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.